# ఇదీ హైటెక్ యుగం!



"ఒరే! ఈ బూమ్మింద దొంగతనం, రంకుతనం ఉండాయే? అవ్వి గంపకిందేసి మూసిపెట్టి ముడుక్కోమన్నా ముడుక్కోవు. రెక్కలొచ్చి ఎగర్తాయి జూడు. కనిపించిన చెవలమిందంతా వాల్తాయి. అందుకే మణిసి ఎంత చండాళంవైన పనైనా చెయ్యచ్చుగానీ దొంగతనం ఉండాదే? అంత చండాళంవైన పని ఇంగొకిటి ఇంగొకిటి ఉండదు. అందుకే అడగతాఉండా. నిజిం చెప్పరా!"

అడిగింది గంగిరెడ్డి. అడిగేది కన్నిగాణ్ణి. కన్నిగాడు గంగిరెడ్డి ఇంట్లో సేద్యగాడు. సేద్యగాడంటే మట్టిని బువ్వగా మార్చే మహాశక్తి. అయినా వాడు తాగేది మోచేతులకింద నీళ్ళేగదా? వాడు పచ్చి నిజం చెప్పినా పరమ అపద్ధమే అవుతుంది. అది వాడి అంతరాత్మకూ తెలుసు. అయినా అడిగింది రెడ్డిగారు. బదులుచెప్పకుండా ఉండలేడుగదా? అందుకే–

"సత్తె పెమాణకంగా నాకు తెల్దయ్యా!"

"ఒరే! ఎన్నిసార్లు అడిగినా 'నాకేం తెల్దు. నాకేం తెల్దు. అని పాడినపాటే పాడ్తాఉండావ్. కాలికుండేది చేతికు తీసుకుంటే అదే చెప్పిస్తింది".

"మీతోడు నాకేం తెల్దయ్యా!"

"అపద్దాలు కుక్కమాదిర్తో మొరిగేదానికి నాతోడు కావాల్సి వచ్చిందిరా దొంగనాకొడకా! ఒకేళ ఈస్వరుడు ఈ ఇంటి దొంగను ఇడ్సిపెట్టేస్తే పెట్టచ్చు. అయితే ఈ గంగిరెడ్డి ఉండాదే? వాడికి ఇట్టామాదిర దొంగకూళ్ళకు అంవడల దూరం. వాళ్ళు హరిహర బెమ్మాదుల్దిగొచ్చినా వాడు మాత్రం వొదిలిపెట్టడనేది కడుపులోనుంచి బయటపణ్ణె బిడ్డ మళ్ళీ కడుపులోకి పోదన్నొంత సత్తిం!"

"అయ్యా! పుట్టి బుద్దెరిగిననాటినుంచి మీతావనపడుండా. మీరు కాల్తో చెప్తే నేను ఈ చేతల్తో చేస్తాఉండా. మీకూడు ఈచేతల్తోనే తింటాఉండా. ఆ చేతుల్తోనే ఇట్టా దొంగకూటికి పాలుపడ్తానా? చెప్పండయ్యా!"

"అందుకేగదరా! గెడ్డంకింద రొండు వడ్లగింజిలేసి అదుక్కుంటా ఉండేది. అయినా నువ్వే చెప్పు. కంటికి తెలవకుండా యాడన్నా కంట్లో పాప మాయంవయిపోతిందా?"

"అయ్యా! మీ మణుసే మీకుసాచ్చి. చెప్పండయ్యా చెప్పండి. నా మొకంజూసి చెప్పండి. మేడిపట్టి పచ్చనిఫైరుపెట్టిన చేతుల్తో ఇట్టా పాడుపని చేస్తానా?"

గుండెల్లో మెలితిరిగిన కన్నిగాడి బాధ గొంతులోకి ప్రాకితే గొంతు బొంగురుపోయింది.

"ఈ నంగేదుపులన్నీ అదకట్టిపెట్టువాయ్! ముదిగారంజేస్తే కుక్కకూడా మూతులు నాకితిందంట. ఇట్టయితే ఇది కుదిరేపనిగాతోచలా. అవుగదా? చెరుకాబెల్లం పెట్టు అంటే పెట్టిందా?"

"అయ్యా! నన్ను కొట్టండి. కండకు కండగా కొయ్యండి. కావాలంటే మీచేతుల్తోనే గొంతు పిసికి చంపిపారెయ్యండి. కానీ ఈ దొంగతనాన్ని మాత్రం నామింద పెట్టబాకండయ్యా"

గుండెల్లో బాధ కండల్లో కరిగి చెంపలమీద జారుతుంటే కన్నిగాడు ఒక్కొక్క మాటను ఆ కన్నీళ్ళతోతడిపి పలికాడు.

నెమలికంట్లో నీళ్ళు గార్తే వేటగాడికి ముద్దా?

గంగిరెడ్డిలో స్వార్థం కసిగా మారి కోపాన్ని దోసిళ్ళతో జుర్రుకొంటే- పండ్లు పటపటలాడుతున్నాయి. కండ్లల్లో నిప్పులు కురుస్తున్నాయి. ఆ ఎక్కుపెట్టిన బాణం ఏ క్షణాన అయినా కన్నిగాడి గుండెల్లో దూసుకొనిపోవచ్చు.

చీమ చిటుక్కుమంటే గుండెలు కలుక్కుమనడం పల్లెల మనస్తత్వం. ఊరు గుప్పుమనింది. ఊరు ఊరంతా ఒక్కటయింది. గంగిరెడ్డి ఇంటిముందు గుంపుకట్టింది!

ఇప్పుడు గంగిరెడ్డి చూపు జనంమీదికి మళ్ళింది.

"అయ్యా! పాలన్నం తినే పదిమంది పెద్దమణుసులు ఇప్పుడిక్కడ చేర్నారు గదా? చెప్పండయ్యా మీరే నాయం చెప్పండి".

ఏమి జరిగిందో ఏమో మాటమాత్రం చెప్పకుండా న్యాయం చెప్పమని అడుగుతున్నాడు గంగిరెడ్డి. పాపం! పాలన్నం తినే పదిమంది నిస్సహాయత చూపుల్లో చిత్రంగా తారట్లాడుతూ ఉంది. అమెరికా కయ్యానికి కాలుదువ్వుతుంటే వద్దని వారించలేక ఇరాక్ తప్పేమీ లేదని తేల్చిచెప్పలేక ఒకదాని మొగం ఒకటి నిస్సహాయంగా చూసుకొంటున్న చమురు దేశాల్తో వాళ్ళ మొగాలు పోటీపడుతున్నాయి!

అది గ్రహించాడు గంగిరెడ్డి.

"ఈ పొద్దుటికి సరిగ్గా మూడేమూడు దినాలకుముందు. అగ్గిచేని పల్లెలో మావొప్పార చుట్టాల పెండ్లి జరిగిందా? జరిగింది. ఆ పెండ్లికి మా ఇంట్లో ఆడది పొయ్యిందా? పొయ్యింది. ఠోకా ఉండేది సుబకార్యానికి గదా? అని బీరవాలో బంగారు గొలుసుతీసి మెళ్ళో ఏసుకొనిందా? ఏసుకొనింది. పొయ్ పెండ్లి చూసుకుణ్ణిందా? చూసుకుణ్ణింది. పెండ్లి అయిపోతానే తిరుక్కోని వచ్చిందా? వచ్చింది. వస్తానే అది ఏంజేసింది? కాళ్ళూ జేతులు కడుక్కోవాలని పెళ్ళోకి పొయ్యిందా? పొయ్యింది. పొయ్నాక ఆడ దానికిఏంబుద్ధి పుట్టిందో ఏంపాడో? ఒళ్ళే కడుక్కోవాలనుకుణ్ణిందా? అనుకుణ్ణింది. అనుకుంటానే అది ఏంజేసింది? మెళ్ళో గొలుసు తీసి గూట్లో పెట్టిందా? పెట్టింది. అది ఉండాదే తినినచోట్నే చెయ్యి మర్సిపొయ్యే బాపత్తు. గొల్సుమాటే మర్సిపొయ్యింది. మద్దేణంకాడ మతికొస్తే ఒక్కలగువులో పెళ్ళోకి పొయ్యింది. పొయ్ గూట్లో తడుంవులాడింది. గొలుసుకు కాళ్ళొచ్చి గునగున నడ్సిపోతే గూట్లో ఏంవుండాది నాతాడు? అప్పిటికీ పాంవరం పట్లేక పాపం! అది దీగూట్లో పెళ్ళో కండ్లు రొండూ చించుకోని ఎతుకులాడింది. ఎతుకులాడ్తే ఏంవయింది? ఎతుకులాటే మిగిలింది. పోనీ! మీరేచెప్పండి. ఇంట్లో ఉండేవాళ్ళను కాదని అదెట్టబోతింది? చెప్పండి. మీరేచెప్పండి".

పాకిస్తాన్ అధ్యక్షుడు ముషారఫ్‌లాగా ముడివేసేదీ తానే విప్పేదీ తానేగా గంగిరెడ్డి అడిగేదీతానే బదులు చెప్పేది తానేగా నోటిమీద కాయపడకుండా మాట్లాడ్తూ ఉంటే ఉళ్ళోవాళ్ళు మాత్రం ఏంజేస్తారు? కాశ్మీర్ పరిస్థితిని క్షుణ్ణంగా అవగాహన చేసుకొని కూడా ఎవరేమిచెప్పినా శ్రద్ధగా వింటున్న ఐక్యరాజ్యసమితి అన్నులనిపించుకొంటారు. ఆ మౌనాన్ని అంగీకారంగా తీసుకొన్న గంగిరెడ్డి-

"పోనీ! ఇంట్లో ఎవురుండారో మీరే చెప్పండి. నేనూ మా ఆడది. మా కొడుకు. ఇద్దో ఈడూ మాసేద్దిగాడు కన్నిగాడు. మమ్మల్నిగాదని ఇంట్లోకి ఇంకెవురొస్తారు? వొచ్చినా ఇంట్లోకొస్తారు గానీ పెళ్ళోకేం పని? పోనీ! పెళ్ళోకీ పొయ్నారే అనుకుందాం. దీ గూట్లోకి తొంగితొంగి ఎందుకు చూస్తారు? చూడరుగదా? అయితే గొలుసు ఏంవయినట్టు? ఈ కొంపలో ఉండేవాళ్ళలో ఎవురో ఒకరు పుణ్ణెంగట్టుకోనుండాల. మా సొత్తు మేంవే దొంగిలించి లేదని చెప్తామా?"

"అదిగాదు గంగిరెడ్డీ! దీనికి పొయ్ ఎందుకిట్లా మల్లగుల్లాలు పడ్తాఉండావే? ఒక్క అడుగు. అట్టా పుత్తూరు దాకా పొయ్యొస్తే సరిపోలా. మమ్మల్ని అడిగినట్టు ఆ అయ్యోర్నే అడిగితే ఆయనే చెప్తాడు గదా?" ఆ గుంపులో ఒక గొంతు గంగిరెడ్డి పాటకు పల్లవి పాడింది.

"అయితే నీదగ్గిర చెప్పించుకుండేదానికి అంత పనికిమాల్నోడను కుణ్ణావా గంగిరెడ్డిని? నిద్దర మొకంతోలేసి పొయ్‌నోణ్ణి. పుత్తూరు నుంచి ఇప్పుడే గదా తిరుక్కోని వస్తాఉండా".

పుత్తూరు మాట చెవుల్లో పడేసరికి ఆ గుంపు గుండెలు గొంతుల్లో చిగురించాయి.

"ఎట్టెట్టా? పుత్తూరి అయ్యోరి తావుకు పొయ్యేసి వస్తా ఉండావా? అమ్మో! అయ్యోరంటే మహన్నబావుడు గదా? అంజనం తంవలపాక్కురుద్ది చూసినాడంటే అచ్చిరం పొల్లుబోకుండా పలకతాడు. అప్పుడట్నేగదా? మాకడగోటోడు అలిగి పరారైపొయ్‌నప్పుడు ఆయన తావుకు పొయ్ తాంబూళంబెట్టి అడిగితే- మూడు గెంటలు... మూడు దినాలు... మూడు వారాలు... మూడు నెలలు- అది తప్పిందంటే మూడేండ్లలో ఇల్లు చేర్తాడని చెప్తే- సరిగ్గా మూణ్ణెల్లు తిరక్కముందే ఇల్లు చేర్నాడా? లేదా?"

ఇరాక్ మీద కాలు దువ్వుతున్న అమెరికా అధ్యక్షుడు బుష్‌కి బ్రిటిష్ ప్రధాని టోనీబ్లెయిర్ వత్తాసు పలుకుతున్నట్లు గంగిరెడ్డికి ఒక తోడు దొరికింది. యుగధర్మం. తోడు దొరకాలేకానీ వాడుకోవడంలో ప్రతి మనిషి రాజకీయ నాయకులకే పాఠాలు నేర్పే పరిణితి సాధించాడు. గంగిరెడ్డి మాత్రం అందుకు మినహాయింపు ఎలా అవుతాడు?

"పుత్తూరులో బస్సు దిగతానే కాయా కర్పూరం తీసుకుంటి. నేరుగా అయ్యోరుండే తావుకుపోతి. అప్పిటికే ఆడ అయిదారుమంది కాసుకోనుండారు. ఆడ ముందొచ్చినోడు ముందే. ఎనకాల వచ్చినోడు ఎనకాలే. వాడెటుమంటి మొగలాయి అయినా ఎనుకు ముందయ్యేదానికి లేదు. అయ్యోరు పూజాపునస్కారాలు చేసుకొని వచ్చికూసుండె. గుమ్మిడిపొండు మాదిర్తో గుమ్మటంగా ఉండే ఆ మణిసి పట్టుపంచె కట్టుకోని ఈబూదిబొట్లు పెట్టుకోని మెళ్ళో రుద్రాచ్చ మాలలేసుకోని పీటమింద కూసుంటే ఆమొకం చూడాలి! ఒక ఎలుగు ఎలిగిపోతా ఉంటింది. వాడెటుమంటి ఇక్లామార్కుడైనా సరే?- అయ్యోర్ని చూస్తానే రొండు చేతులెత్తి మొక్కాల్సిందేగదా?"

"అది సరే గంగిరెడ్డీ! ఇంతకూ అయ్యోరు ఏంచెప్పినాడని?"

"నువ్వు నన్నొక పనికి మాల్నోడికింద జంవగట్టినట్టుందావే? అయ్యోరు ఎవుడిమిందనో చెప్తే నేను వచ్చొచ్చి ఈణ్ణే ఎందుకడగతా?"

"ఎట్టెట్టా? పుత్తూరయ్యోరు ఈడిమిందనే చెప్పినాడా? అయితే ఇంకా ఎందుకీ మద్దిస్తం?"

ఆ మాటతో చేజారిన ఆరుసవరాల బంగారుగొలుసు సజీవదృశ్యమై కండ్లముందు మిలమిలా మెరిస్తే గంగిరెడ్డి కొలిమి గుండెల్లో మంటలు నాల్కలు సాచి పొగలు కక్కుతున్నాయి. అయినా నిగ్రహించుకొన్నాడు.

"ఒరే! చెప్పరా. యాడదాచిపెట్నావో చెప్పరా?"

"ఆ దేముడి సాచ్చిగా నాకు తెల్దయ్యా!"

"పోనీ! ఎవురికిచ్చినావో చెప్పరా?"

"మీ పాదాలసాచ్చిగా ఈ పాపంజేసిన కండ్లతో నేను చూణ్ణేలేదే? ఇంక ఎవుడికో ఇచ్చినానని ఎట్లా చెప్పమంటారయ్యా?"

"సరే! ఎక్కడ అమ్మేసినావో చెప్పరా?"

"మాయబ్బతోడు నాకు తెల్దయ్యా!"

ఆ మాటతోగూడా గంగిరెడ్డి చెయ్యి పైకిలేచింది. అంతవరకు ఓర్చిన ఓర్పు శక్తిగా మారి చేతికి ఊపు వచ్చింది. కన్నిగాడి గూబగుంయ్‌మనింది.

ఆ దెబ్బతో వాడు తూలి కిందపడ్డాడు. పడి గంగిరెడ్డి రెండు పాదాల్ని వొడిసిపట్టుకొన్నాడు. దెబ్బతిన్న గూబ గొంతులో పుండై సలిపితే వాడుఎలుగెత్తి–

"మీ పాదాలకిందుండే బూదేవి సాచ్చిగా చెప్తాఉండా. ఈ చేతల్తో నేనాగొలుసు తాకుంటే ఇద్దో నానోట్లో ఈ మట్టి పడ్తింది!" అంటూ చారడు మట్టిని జవురుకొన్నాడు.

మట్టికి ఉన్న మహిమ అది!

మట్టినినమ్ముకొని బతుకుతున్న గంగిరెడ్డికి ఆమట్టే సాక్ష్యం. అందుకే ఈ కఠిన సత్యాన్ని జీర్ణించుకోలేక పోయాడు. ఓర్పు నశించింది. ఎడం కాలికి మత్తెక్కింది. ఎగిరి ఒక్క తన్ను తన్నాడు.

కన్నిగాడి చెమట వీర్యంతో గర్భవతి అయి తొమ్మిదినెలలు నిండిన గంగిరెడ్డి ఇంట్లో గాదె ముసిముసిగా నవ్వుకొనింది.

"నువ్వు కండ్లతో చూళ్ళేదు. చేతల్తో తాకలేదు. అయితే పుత్తూరి అయ్యోరికి నీమిందేం వన్నా పగనా?" ఆదిఅంతం లేకుండా నేటి రాజకీయ నాయకుడి అధికార వాంఛలా పెరిగిన గంగిరెడ్డి కోపం ఉన్నట్లుండి అనునయంగా మారింది.

పుత్తూరు అయ్యవారి మాట చెవిని పడడంతో కన్నిగాడి కడుపు రగిలింది. వాడి చూపు చేతిలో మట్టిమీదికి మళ్ళింది. అది ప్రతినిత్యం తాను చెమటతో అభిషేకించిన మట్టి. సాటి మనిషి కొట్టినా మట్టి కడుపు కొట్టదన్న ధైర్యం వచ్చింది. వాడు ఒక్క ఊపులో పైకిలేచి–

"పదయ్యా పద. పుత్తూరికి పద! అయ్యోరు నన్నుజూసి నామింద చెప్పనీ. అక్కడికక్కణ్ణే వాడి నాలికబట్టి తెగ్గొయ్యక పోతే నేను..."

"అయ్యో! అయ్యో! పుత్తూరు అయ్యోర్నే అనరానిమాట అంటావంట్రా?"

పుత్తూరు అయ్యోరిమీద భక్తివిశ్వాసాలు ఆ గుంపు గుండెల్లో జొరబడితే ఆశ్చర్యం ఆవిర్లుకక్కింది.

"అంటానయ్యా! అంటాను. ఎందుకనను? చెయ్యని దొంగతనాన్ని చేసినానని అన్నాయంగా నింద నామింద మోపితే– ఆ నాకొడుకు రగతం కండ్లజూసేదాకా..."

పూనకం పూనినట్టు కన్నిగాడు ఊగిపోతున్నాడు!

"ఇనండయ్యా ఇనండి. వాడు కూసే కూతలు ఎట్టుండాయో ఇనండి. మహన్నబావుడు అయ్యోర్నే అనరాని మాట్లు అంటాఉండాడంటే?..." మందిని మళేసుకుందేదానికి గంగిరెడ్డి మాట లౌక్యంతో వియ్యమందింది.

"వాడు అంతమాట అంటా ఉండాడంటే?...వాడేగనక తప్పు చేసుంటే అంత దయిర్నం వాడికెట్టొస్తిందబ్బా?" ఒక గొంతులో నుండి ఊడిపడిన సందేహం ఆ గుంపును ఒకఊపు ఊపింది.

గంగిరెడ్డి గుండె ఒక్క క్షణం తడబడింది. అంతలోనే తెపరాయించుకొని–

"అయ్యా! పదిమంది తమబోటి పెద్దోళ్ళు నడిచే దోవలో నిలబడుకోని చెప్తాఉండా. అపద్దం చెప్పాల్సిన కర్మ నాకేం పట్టింది. అయ్యోరిముందర కాయాకర్పూరం పెట్నా. తాంబూళం పెట్నా. ఆ తాంబూళంలో అయిదు రూపాయలు దచ్చినపెట్నా. అంతే! నేను మడిచేతులు కట్టుకోని కూసుణ్ణా. అయ్యోరు నేను పెట్ని తాంబూళంలోనే ఒక తంవలపాకు చేతికితీసుకుండె. డబ్బీలో అంతకాటికి తీసుకోని తంవలపాక్కు పూసె. దాన్ని మడ్చి అర్సేతిలో పెట్టుకోని రోంచేపు మంత్రాలేవో గొణిగె. ఆమిందట ఆకు ఇప్పి అర్సేతుల్లో పెట్టుకొని రెప్పార్పకుండా దానికల్లానే చూస్తా– రెడ్డీ! నీమిద్దింటికి తూర్పు వాకిలి. వాకిలిముందు మూడు అంకణాల పశువుల కొట్టం. ఆ కొట్టానికి ఉత్తర దిశలో పెరడు. ఆ పెరట్లో పడమటి తట్టు గోడకు ఒకదీగూడు. ఆగూట్లో పెట్టిన బంగారు గొలుసు కనబడలేదు. ఏమంటావ్?" అని అడిగె.

నా ఇల్లూవాకిల్ని టీవీలోచూసి చెప్పినట్లు చెప్తాఉంటే నాకు నరెంటిక పడె. నాకు తెలవకనే రొండు చేతులు జోడిస్తి!

"అడిగిన దానికి సమాధానం చెప్పు రెడ్డీ!" అని రెట్టించె.

"అచ్చిరం పొల్లుబోకుండా అంతా నిజింవేసాంవీ!"

'రెడ్డీ! మనిషి చామనచాయలో ఉంటాడు. అంత పొట్టీగాడు. అంత పొడుగూకాదు. అంత లావు కాదు. అంత సన్నమూకాదు. మీసకట్టు ఏర్పడీ ఏర్పడని వయసు. మనిషి మంచి దారుఢ్యంతో ఉంటాడు. ఇంతకూ నీ ఇంట్లో మనిషే. నీ కష్టం తిని బతికే మనిషే. అయితే నగ చేతులు దాటిపోయింది. దొరకడం కష్టం. అయినా ప్రయత్నించు" అనె.

"ఇప్పుడు మీరేచెప్పండయ్యా? చెప్పండి– వీడు అవునో కాదో?" అంటూ గంగిరెడ్డి దైన్యాన్ని పులిమిన చూపులతో ఆ మందిని పరామర్శిస్తూ చేతులెత్తి దండం పెట్టాడు.

"గంగిరెడ్డీ! నీకేంవన్నా పిచ్చిగిచ్చి పట్టిందా? రామాయణమంతావిని రాంవుడు సీతకేం కావాల? అని అడిగినట్టుండాదే యవ్వారం. పుత్తూరయ్యోరంటే ఏంవనుకుణ్ణావ్? ఆయనేం వన్నా సటపటమైన మణిసా? ఆ కండ్లు గెంవనించలా? పిల్లి కండ్లు గదా? సీగిట్లో పిల్లిసూపే గదా అది! అపద్దాలు చెప్పేటట్టుగా ఉంటే ఆయన తావుకు అంతమంది ఎందుకుపోతారు?"

గ్రామ పినపెద్ద వెంకట్రాయులు తాత. తాత ఆమోదముద్ర పడిందంటే గ్రామన్యాయం తలెత్తి నిలబడుతుంది. ఆమాట కోసరమే ఎదురుచూస్తూ ఉండిన గంగిరెడ్డి కార్గిల్ యుద్ధంలో భారతవీరుడే అయ్యాడు. కన్నిగాడిమీద విరుచుకు పడ్డాడు!

కాలితో... చేత్తో... ఏదివాటమైతే దాంతో... మార్చి మార్చి దెబ్బమీద దెబ్బ పడ్తానే ఉంది. దెబ్బ దెబ్బకూ "అయ్యో! కుయ్యో!" అని గుండెలు అవిసేలా ఏడుస్తూ "నాకేం తెల్దయ్యా.

నన్ను రక్షించండయ్యా!" అని చుట్టూచేరిన జనాన్నిచూస్తూ చేతులు జోడించి చూపులతో అర్థిస్తున్నాడు.

పాలన్నం తినే పదిమంది పెద్ద మనుషుల రాతిగుండెల్ని ఆ చూపు కరిగించలేకపోయింది. అన్యాయాల్ని ఎదిరించాలి. అక్రమాల్ని అంతంచేయాలి!– అన్న ధ్యేయంతో కవులు, రచయితలు విరివిగా సాహిత్యాన్ని సరఫరా చేయాలంటే వాళ్ళకు ముడిసరుకు అవసరం అనుకొన్నారేమో? వేడుక చూస్తున్నారే కానీ ఎవరూ ముందు పడలేదు.

కొట్టి కొట్టీ గంగిరెడ్డి కాళ్ళు చేతులు సలుపుతున్నాయి.

ఇక కొట్టే ఓపిక కూడా లేకపోయింది.

"నీ కత ఇట్టగాదురా!" అంటూ వొడిసి వాడి జుట్టు పట్టుకొన్నాడు. వంగదీస్తూ ఒక్కతన్ను తన్నాడు. పట్టాలుతప్పిన రైలుపెట్టెలా వాడుతలకిందులుగా పడ్డాడు. పట్టిన జుట్టు పట్టువదలకుండా చచ్చిన గొడ్డును బరబరా ఈడ్చినట్లు వీధిలోనుండి ఇంట్లోకి ఈడ్చుకొని పోయాడు.

అలా ఈడ్చుకొనిపోతుంటే వాడు ఆ ఇంటికి తాకట్టు పెట్టిన పౌరుషం తలవంచింది!

పశువుల కొట్టంలో రాతి కూసానికి పెడరెక్కలు విరిచి కట్టేస్తుంటే వాడి శక్తి చేతులు కట్టుకొనింది. మట్టిలోనుంచి చరిత్ర సృష్టించిన ఆ వీరుడికే చరిత్ర పుటల్లో చోటు లేదు. అలా లేనివాళ్ళు ఈ పుణ్యభూమిలో ఎందరో?– వాళ్ళల్లో కన్నిగాడు ఒక్కడు.

గంగిరెడ్డి చింతనిప్పుల కండల్లోనుంచి జారిన కోపం గుండెను బండగా మారిస్తే ఎగిరెగిరి తన్నుతూ 'నిజం చెప్పరా?' అని అడుగుతున్నాడు. వాడు చేయని నేరాన్ని చేశానని ఎలా చెప్తాడు? చెప్పలేదు. చెప్పకపోతే గంగిరెడ్డి రెచ్చిపోతున్నాడు.

వాడు తన్నిన తన్నులు... కొట్టిన దెబ్బలు... తిట్టిన తిట్లు మౌనంగా భరిస్తున్నాడు.

పాపం! కన్నిగాడు ఈ దేశంలో ఏదో ఒకమతమౌఢ్యానికో... లేదు సిద్ధాంతానికో కట్టుబడిన ఆత్మాహుతిదళంలో సభ్యుడుకాదు చంపినా నోరువిప్పక పోవడానికి!

వాడు ఒక అమాయకుడు!

ఆ అమాయకుడి మౌనరోదన గాటకట్టిన గొడ్లు... వాడి చేతి మేపు తిన్న గొడ్లు గ్రహించాయి. నోరులేని గొడ్లుకార్చిన కన్నీళ్ళు గాట్లోకసువు గుండెల్ని తడుపుతున్నాయి!

ఒంటిమీద దెబ్బ తగలని చోటే లేకపోతే ఒళ్ళు పుండు పుండు అయింది. కట్టిన కట్లు మంట పెడుతున్నాయి. ఎంత ప్రయత్నించినా మెడ నిలబడడం లేదు.

ఇప్పుడు వాడిప్రాణం ఆకుఅంచున నీటిబొట్టు!

ఈ ఘోరాన్ని చూడలేనన్నట్లుగా కాలపురుషుడు నల్లని ముసుగు తొడుక్కుంటున్నాడు.

"యదవ. పనికిమాల్ని యదవ. ఇంట్లో బిడ్డమాదిరుండి ఇంత పనికి వగతెగిస్తాడా? వాణ్ణని ఏఁవిలాబం? కాలఁవే అట్టయిపాయ!" అని తలకొక్క తీరుగా తలపోసుకొంటూ గంగిరెడ్డి ఇంటి ముందర గుంపు ఎప్పుడో ఎవరిదారి వాళ్ళదయింది.

కన్నిగాడి ఎదురుగా గంగిరెడ్డి మంచం వాల్చి కూర్చున్నాడు. చూపులు మంటలై వాణ్ణి నిలువునా కాలుస్తున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో ఆవేశం పొగలు కక్కుతూ ఉంది. కాలం గంగిరెడ్డి అలుపును చప్పరించేస్తుంటే ఓపిక! ఓపికలో ఊపు! ఆ ఊపులో లేచి వాడి మీదపడడం!

ఆ ప్రహసనం ఆగకుండా సాగుతూనే ఉంది.

అర్ధరాత్రి దాటింది. ఒక్క గంగిరెడ్డి ఇల్లు తప్పిస్తే ఊరు నిద్రపోతూ ఉంది. కన్నిగాడు కుమిలికుమిలి ఏడ్చాడు. ఏడ్చే ఓపికను తన్నులూ దెబ్బలూ మింగేస్తే ఏడుపు మూలుగులుగా మారింది. అప్పటికి ఆ మూలుగులుకూడా మూగపోయాయి.

అప్పుడు ఇంట్లో ఇల్లాలు కలగచేసుకొనింది.

"పోతే పొయ్యింది పాడునగ. వాణ్ణి ఎందుకట్లా కొట్టికొట్టి చంపేస్తావే?– చేతికెదిగినోడు చెయ్‌దాటిపోతే?– నగనన్నా సంపాయించుకోవచ్చు కానీ మణిసిని?" అంటూ అడ్డుపడింది.

"చంపతానే! వాణ్ణి నిలవనా చంపతానే. నగ పొయ్యిందని కాదే నాబాద. తూబెహ! ఆ నగ ఎంత? నామాఁవిడి తోపులో నాలుగుచెట్ల కాపంత కాదే? కడుపులో పుట్నె బిడ్డతో సరిసమానంగా చూసుకుంటే కడాన ఇదా ఈడు చేసేపని?" అని ఇల్లాలి మాటల్ని ఈ చెవుతో విని ఆ చెవులో వదిలేసి గంగిరెడ్డి కాలంతో పోటీపడ్తూ కాలికీ చేతికీ పనిచెప్తూనే ఉన్నాడు.

తెల్లారింది.

కన్నిగాడి బతుకూ తెల్లారిపోయింది!

"అయ్యయ్యో! అడివిలోనాయం ఊళ్లోకొచ్చేసిందే? ఒక నగకోసరం నిండు పాణాల్ని ఎవుడైనా నిలవనా తీస్తాడా? పుట్టి బుద్దెరిగిన నాటినుంచి వాడు చేసిన కష్టిం లెక్కగట్టుంటే ఇటుమంటి నగవొగిటికాదు– పది రమ్మంటే రావా?"

ఊరు నోరు చేసుకొనింది!

అప్పటికికానీ గంగిరెడ్డికి ప్రతి ప్రభుత్వానికి ఒక ప్రతిపక్షం ఉన్నట్లు తనకా ఊళ్ళో కాని వాళ్ళున్నారన్న సంగతి గుర్తురాలేదు. ఆమాట మనసులో మెదిలేసరికి గుండెలు అరిచేతుల్లోకి వచ్చాయి. అలానే పట్టుకొని ఊరిమీదపడ్డాడు. కనిపించిన ప్రతి వ్యక్తి 'ఇవ్వి చేతులు గాదని' చేతులే పట్టుకొంటున్నాడు. ఈ గండంనుంచి గట్టెక్కించమని ప్రాధేయపడుతున్నాడు!

"సరే! ఇట్టామాదిరి జరగాలని రాసిపెట్టి ఉణ్ణింది. జరిగిపొయ్యింది. ఇంక ఏఁవి మాట్లాడితే మాత్రం ఏఁవి లాబం? ఇట్టయితిందని ఆయనేఁవన్నా అనుకుణ్ణాడా? అక్కడా ఇక్కడా పొక్కి కొంపలు అంటకపోకముందే కాల్చి పారేసి కంటికి మరుగుచేసేస్తే పోతింది. గంగిరెడ్డీ! నువ్వు ముందాపని చూడు" అంటూ అయినవాళ్ళు పురమాయిస్తున్నారు.

అయితే ఈ వ్యవస్థలో మాటలు ఊపిరిపోసుకున్నంత ఉదారంగా చేతల్ని ఊహించలేము కదా? ఊహిస్తే మనం మనుషులు ఎలా అవుతాం?

అందుకే కొందరికి డబ్బుగా... మరికొందరికి ఆడబ్బు తెంపుగా రూపాంతరం చెంది సారాగా– గంగిరెడ్డి ఇంట్లో ఇనప్పెట్టెలోని పచ్చ కాగితాలకు కాళ్ళొస్తే కన్నిగాడి శవం కదిలింది.

అప్పుడు గంట పది అయింది.

సాధ్యమైనంత తొందర్లో కన్నిగాడి కట్టెను కట్టెల్లో ఒక కట్టెగా బూడిద చేయాలన్న తాపత్రయం కాళ్ళకు బుద్ధి చెప్పింది. శవయాత్ర ఊరిగెవిని దాటింది! కాటికి చేరడానికి ఉరుకులు పరుగులమీద ఉంది.

అంతలో ఒక జీప్ శరవేగంతో వచ్చింది. శవ వాహకులముందు ఆగింది. జీప్ ఆగీ ఆగడంతోటే సబ్– ఇన్స్‌పెక్టర్ తన సిబ్బందితో దిగాడు. ఆ గుంపును చుట్టుముట్టాడు. శవాన్ని స్వాధీనపరుచుకొని జీప్‌లోపెట్టించాడు.

ఆ తరువాత "గంగిరెడ్డీ! ఎక్కు జీప్!" అన్నాడు సబ్–ఇన్స్‌పెక్టర్.

ఇది కానివాళ్ళు కట్టుకొన్న పుణ్యకార్యమని గ్రహించిన గంగిరెడ్డి వాళ్ళ గొంతులు కొరికి నెత్తురు తాగాలన్నంత కోపంతో కొంకర్లు తిరిగినా పరిస్థితుల చేతుల్లో బానిస. అందుకే నంగిగా–

"నేనేం చేశానయ్యా నన్ను జీప్ ఎక్కమంటా ఉండారే?"

"నువ్వు ఏంచేశావో తెలుస్తుంది. ముందు ఎక్కువాయ్ జీప్!" పోలీసుజులుం హుంకరించింది.

"అదిగాదయ్యా? నా నగపాయ్ నేను ఏడ్సి చస్తాఉంటే నేనెందుకెక్కాల జీప్? పుత్తూరి అయ్యోరి తావుకు శాస్త్రానికి పోతే కన్నిగాడే కన్ను కత్తరించేసినాడని చెప్పె. నలుగురి ముందర వాణ్ణి నిలదీస్తే వాడా అగుమానాన్ని బరించలేక ఉరుబోసుకొని సచ్చె. దిక్కులేని పీనిగ. కుక్కలు నక్కలు పెరక్కతినకుండా అట్టా మట్టికి మరుగు జేద్దామనుకుంటే? పుణ్ణానికి పోతే పాపం ఎదురైనట్లుండాదే కత?"

"అబ్బో! ఎంత పుణ్యకార్యం చేస్తున్నారు రెడ్డిగారూ! ఆహాహా! అనాథ ప్రేత సంస్కారం అంటే మాటలా? అందుకే గదా జీప్ ఎక్కమంటున్నది. శవపరీక్ష జరిపిస్తే నీ పుణ్యకార్యం ఎంతో తేలిపోతుంది. దానికి తగిన సత్కారమూ ఉంటుంది. హుం! పుత్తూరు అయ్యవారు... శాస్త్రాలు! ఆయన ఎంత గొప్ప శాస్త్రజ్ఞుడంటే అమెరికాలో క్లోనింగ్ శాస్త్రజ్ఞులకంటే నిపుణుడు గదా?– ఇక పోలీస్‌డిపార్ట్‌మెంట్... పోలీసులు ఎందుకూ?– నీ కథలు అక్కడికి కట్టిపెట్టి ఎక్కువాయ్ జీప్!" సబ్–ఇన్స్‌పెక్టర్ ఆజ్ఞ!

గంగిరెడ్డి పాటించకతప్పలేదు!

ఏది జరిగినా గుంపుచేరి గుడ్లప్పగించి చూడడానికే అలవాటుపడిన ఊరు నిస్సహాయంగా చూస్తూ ఉంటే జీప్ బయలుదేరింది!

"ఒకే ఒక్క గెంట ముందుగా ఎలబారి వచ్చుంటే నా కొడుకులు జీవనిండికి బూడిద ఎత్తుకోని పొయ్యుందురు. అయినా తల్రాతను తప్పించేదెవుడితరం?" అని అయినవాళ్ళు అలస్యాన్ని జరిగిన సంఘటనకు ముడేసే ప్రయత్నం చేస్తుంటే కానివాళ్ళ కండ్లల్లో కనకాంబరాలు పూస్తున్నాయి!

*　　*　　*　　*

గంగిరెడ్డి ఎదురుగా పుత్తూరు అయ్యవారు. అయ్యవారికి ఎదురుగా గంగిరెడ్డి. ఒకరికి ఎదురుగా ఒకరు కూర్చున్నారు.

తన శాస్త్రం తననే వంచించిందే? అన్న సందేహం అయ్యవారి కండ్లల్లో కాపురం పెడ్తే సమాధానం కోసరం చూపులు శూన్యాన్ని తడుముతున్నాయి. గుండె బరువు తలకెక్కితే తలవాల్చిన గంగిరెడ్డి ఉన్నట్లుండి తలపైకెత్తి–

"మన తల్రాతలు ఇంతేనంటారాసాఁవీ?" అని అడిగాడు.

తాంబూలం దక్షిణ పెట్టలేదన్నట్లుగా అయ్యవారు గంగిరెడ్డిని ఒక్కచూపు చూసి–

"రెడ్డీ! నేరుగా పుత్తూరికి పో. మా ఇంట్లో అడిగి అంజనం డబ్బా తీసుకో. వస్తా వస్తా మరిచిపోకుండా ఒక తమలపాకు కూడా తీసుకొనిరా!" అంటూ ఏడవలేక నవ్వుతున్నాడు.

"ఎట్టబ్బా పుత్తూరికి పొయ్యేది?" అని దిక్కుతోచకుండా గంగిరెడ్డి దిక్కులు చూస్తా ఉంటే ఒక దిక్కులో పదహారు కమ్ములు విరగబడి నవ్వుతున్నాయి!

గంగిరెడ్డి తల వాలిపోయింది_దెబ్బమీదదెబ్బ తిని కన్నిగాడి తల వాలిపోయినట్లు!.....

ఈ భూమి మీద దొంగతనం, రంకుతనం దాచిపెట్టినా దాగవని గంగిరెడ్డి ఆడినమాట అనుభవపూర్వకమయింది. అక్షరసత్యమయింది.

ఊరు వాస్తవాన్ని కోడై కూస్తే గంగిరెడ్డి భార్య మేలుకొనింది!

జరిగినదంతా ఒక్కసారి కండ్లముందు దృశ్యమానమై గాజు పెంకుల్లా కండ్లలో గుచ్చుకొంటుంటే కండ్లలో కన్నీళ్ళ రక్తం. గుండె పోటెత్తింది. ఊపిరాడని భవిష్యత్తు కాళ్ళల్లోకి ప్రాకితే ఆమె నిలబడినచోట నిలబడలేకపోతూ ఉంది. కొడుకు కంట పడ్తే వాడిని ఏంచేయాలన్న సందిగ్ధావస్థలో సవాలక్ష ప్రశ్నలు వేధిస్తున్నాయి. కోపం కౌగిట్లో నలుగుతున్న ఆమెకు కాలం గడ్డకట్టినట్లనిపిస్తూ ఉంది.

అప్పుడు కుమారుడు కూనిరాగాలవగలు వయ్యారాలు పోతుంటే ప్రత్యక్షమయ్యాడు!

"ఒరే! కడపన చెడబుట్టిన్నా కొడకా! ఎంతపనికి వగతెగించినావురా? ఇంతకంటే కంటికి మరుగ్గా అంతవిసంబెట్టి చంపేయరాదంట్రా?"

"నేనేం చేశానమ్మా?"

"ఒరే! నీ సిగ్గు జిఁవద? ఏంజేసినానని ఎట్రా మొరగతావు ఆ కూడుతినే నోటితో? నువ్వు చేసిన దొంగతనం వాడిమింద చెప్పిస్తావా?"

"ఎవురమ్మా నీకు చెప్పింది?"

"ఒకరేందిరా చెప్పేది? ఊరే కోడైకూస్తా ఉంటే ? ఒక నిండు పాణాన్ని నిలవనా తీయిస్తివి. కన్నతండ్రిని జైలుపాలు చెయ్‌పిస్తివి. ఇంతకంటే ఇంకా ఏం చెయ్యాల్రా భ్రష్టుపట్టిన్నాకొడకా! చూడు నిన్నేం చేస్తానో? నీ కతంతా పోలీసులకు చెప్పి నిన్ను జైలుకు పంపించకపోతే నేను గంగిరెడ్డి పెండ్లాన్నీ కాను. నీకు అమ్మనూ కాను". అంటూ కోపంతో కొంకర్లు తిరుగుతూ కొంగు ఈడ్చి నడువున చెక్కింది.

ఆవేశంతో ఊగిపోతూ అనడానికేమో అంతమాట అనిందికానీ ఆపని చేయలేకపోయింది- కన్నపేగు నోరుకుట్టేస్తే!

ఏంచేస్తాం? ఈ వ్యవస్థలో మెదడు ఎదిగిన ఎత్తుకు మనసులు ఎదగలేదు. మనిషి మస్తిష్కము క్లోనింగ్ స్థాయికి ఎదిగినా మనసుల్ని క్లీనింగ్ చేసుకోలేక మరుగుజ్జులుగానే మిగిలాం. మెదడు మాత్రం నక్షత్రమండలాల్లో విహారాలు చేస్తుంటే విజ్ఞాన తన్మయత్వంతో విర్రవీగుతున్నాం కానీ కాళ్ళుమాత్రం నేలమీదనే!

ఆటవికయుగంలోఅయినా ఆటమికయుగంలో అయినా మనస్తత్వాలు మాత్రం ఆకాళ్ళకింద నలిగిపోతూ!... ●

తానా వారి తెలుగు పలుకు - 2003

రచన - ఆగస్టు 2003